
# జీనా ఇసీ కా నామ్ హై

## భక్తవత్సలం



దినకర్ ఎదురుగ కూర్చున్న వ్యక్తి గడ్డం మాసి ఉంది. పీక్కుపోయిన ముఖం - కళ్ళ చుట్టు ఏర్పడిన నల్లని రంగు అతను బాగా అలిసిపోయినట్లు తెలియజేస్తున్నాయి.

ఇప్పటికే బాగా ఆలస్యమయ్యింది. వీలయినంత తొందరగా ప్రోసెస్ చేసి క్లైం సెటిల్ చేయాలి మీరెలాగయినా", అన్నాడు.

అతడిచ్చిన పేపర్స్ పరిశీలన చేస్తున్న దినకర్ టేబుల్ పైకి వంగి "నేనివ్వవలసిన ఫీజేదయినా వుంటే చెప్పండి' ', అన్నాడు తగ్గు స్వరంలో.

"నోనో! ప్లీజ్ - మా ఆఫీసులో అటువంటిదేం వుండదు. దయచేసి ఇంకోసారి ఆ ప్రసక్తి తేవద్దు. హాస్పిటల్ రిపోర్టు, అటెండింగ్ ఫిజిషియన్స్ రిపోర్టు ఇప్పుడే కదా ఇచ్చారు. వీటి కోసమే మీ క్లైం పెండింగ్‌లో వుంది. రిపోర్ట్సు సరిగా వున్నట్లే వుంది. నేను క్లైం శాంక్షన్‌కు నోట్ ఈ రోజే తయారు చేసి పుటప్ చేస్తాను. వారం రోజుల్లోగా మీకు మా కమ్యూనికేషన్ అందుతుంది", అని భరోసా ఇచ్చారు - దినకర్.

ఆ మాటలు విన్న విజిటర్ కుదుటపడి 'థాంక్స్' చెప్పి వెళ్ళబోతుండగా పదకొండు గంటలకు ఆఫీసులో అందరికీ కాఫీలు ఇచ్చే బాయ్ వచ్చాడు. "కూర్చోండి. కాఫీ తీసుకుని వెళ్ళండి", అని ఆపాడు దినకర్.

"అసలెలా జరిగింది యాక్సిడెంట్?" కాఫీ తాగుతూ పర్సనల్ క్యూరియాసిటితో అడిగాడు - దినకర్.

"ఇంటిముందు, వరండాలో పనిమనిషి నీళ్ళు జల్లి కడిగింది. అక్కడి కెళ్ళిన మా ఆవిడ పాలిష్ బండలపై తడిలో కాలు జారి ఇంటి ముందు మెట్లపైకి జారి పడింది. వెన్నెముకలో సన్నని ఫ్రాక్చరొచ్చిందట ... డాక్టరు కదలనే కూడదన్నాడు. పెయిన్ కిల్లర్స్‌తో నొప్పి తగ్గగా మా ఆవిడ బాగానే వుందని ఒక పూట లేచి తిరిగింది. ఇక అంతే? రెండు కాళ్ళు వాడడానికి వీల్లేకుండా అయింది. షి యీజ్ టుబి ఆన్ ద బెడ్ పర్మనెంట్‌లి ఇన్ ఫ్యూచర్. నావి టూరింగ్ డ్యూటీస్. ఆమెను చూసుకోవడానికి ఇంటి పట్టునే వుండాల్సొచ్చింది. ఫిజికల్ స్ట్రెస్‌కు తోడు నా ఆదయం కూడ తగ్గిపోయి ఇబ్బందిగా వుంది. ఈ క్లైం సెటిల్ అయితే కొద్దిగా వూపిరాడుతుంది."

"డోంట్ వర్రీ అబౌట్ దిస్. అయిదు రోజుల్లో మీకు మొదటి చెక్ అందే ఏర్పాటు చేస్తాను", అని చెప్పి పంపించాడు దినకర్. దినకర్ ఇన్సూరెన్స్ కంపెనీలో ఆఫీసర్. వెన్నెముకకు దెబ్బతగిలి శాశ్వతంగా పడక చేరిన ఆమె లక్ష రూపాయల ఇన్సూరెన్స్ పాలసీపై 'డిసెబిలిటీ బెనిఫిట్' క్రింద ప్రతి నెల 834 రూపాయలు పది సంవత్సరాల పాటు ఆమె కందుతుంది. అంతవరకు దినకర్ గమనించని ఒక విషయం క్లైం పాసయి పేపర్స్ తిరిగి అతని టేబుల్ పైకొచ్చినప్పుడు గమనించాడు. ఆమె భర్త పూర్తి పేరు తనకు కొన్నాళ్ల కిందట పరిచయమైన పేరే. కాలగమనంలో అయిదేళ్ళు వెనక్కు వెళ్ళింది - దినకర్ మనసు.

* * *


దేవుడు సుహాసినికి మంచి గాత్రం ఇచ్చాడు. దానికి తోడు ఆమె తల్లి వనజాక్షి చిన్నప్పట్నుండి ఆ అమ్మాయికి సంగీతంలో ట్రైనింగ్ ఇప్పించింది. మొదట రేడియోలో ఎక్కువగా పాడేది సుహాసిని. అప్పట్నుంటే ఆమె గానాన్ని మెచ్చుకుంటూ సంగీత ప్రియుల నుండి కొద్దిగా ఫాన్

మెయిల్ అందేది. టి.విలో పాడ్డం ప్రారంభించాక గాత్రానికి తోడు మంచి రూపం వున్న ఆమెకు రాష్ట్రం నలుమూలల నుండి ఫాన్ మెయిల్ అందుతోంది. సుహాసినికి ఆ జాబులు చదివి వినిపించడానికి ఆమె తల్లి వనజాక్షికి ఇంటి పనంతా పూర్తయి రాత్రి పడుకునే ముందే వీలయ్యేది. వాటిలో కొన్నిటికయినా జవాబు రాయాలని సుహాసిని కోరిక. ఆ మాటే అమ్మతో అంటే "నా వల్ల కాదు తల్లి! ఏదో చదివి వినిపించమంటే సరేగాని, ఇంతపని చేసుకుని ఒక జాబులు కూడా రాయాలంటే ఎక్కడ్రాసేది. నేనిన్నిద్రపోవద్దా!' అంది.

ఆ మాటలకు నిరుత్సాహపడిన కూతురి ముఖం చూసి - తిరిగి తనే "పోనీ రేపు బాబు నడుగు. వీలయితే రాసిస్తాడు", అంది వనజాక్షి.

బాబు అంటే వాళ్ళింటి మేడపైన అద్దెకుంటున్న దినకర్ బాబు. వనజాక్షి, సుహాసిని ఇద్దరూ అతన్ని 'బాబు' అనే పిలుస్తారు.

ఆ మాటతో తృప్తిపడిన సుహాసిని శాంతంగా పడుకొంది. అందిన వుత్తరాల్లో తన గానాన్ని, అంతకన్నా ఎక్కువగా తన అందాన్ని - అందమయిన మాటలతో మెచ్చుకొంటూ ముచ్చటగా పదాలు కూర్చి రాసిన 'మురళి' అనే యువకుడి ఉత్తరం ఆమె మనసుకు హత్తుకొంది. మెడికల్ రిప్రజంటేటివ్‌గా పనిచేస్తూ రెండు జిల్లాల తన ఏరియా టూర్ చేస్తున్న ఇరవై అయిదేళ్ళ పెళ్ళి కాని అబ్బాయిలా తనను పరిచయం చేసుకున్నాడు. తన రూంలో కూర్చొని పత్రిక తిరగేస్తుండగా వినిపించిన మధురమైన గానానికి అతనెలా పరవశించిందీ, ఆయస్కాంతంలా లాగబడి హాల్లో వున్న టి.వి. ముందుకు ఎలా చేరిందీ - టివి స్క్రీన్‌పై కనిపించిన అందమైన యువతిని చూసినప్పుడు ఆనందరవళి, అనురాగ మురళి అతని మదిలో ఎలా పలికినాయో మధురంగా వర్ణించి రాశాడు. ఎంత ప్రయత్నించినా ఆమె అందమైన ముఖం అతని కన్నుల ముందు నుండి తొలగిపోవడం లేదని - మధురానుభూతి వల్ల కలిగిన ఆనంద పారవశ్యంలో నిద్ర పట్టక సగం రాత్రి టేబుల్ లాంప్ ముందు ఏకాంతంగా కూర్చొని ఆ మాటలు రాస్తున్నట్లు మనసుకు హత్తుకొనేలా రాశాడు. తన ముఖాన్ని, అందాన్ని అతడు వర్ణించిన తీరు తలచుకుంటే సిగ్గుతో ముఖం ఎర్రబడింది సుహాసినికి.




'అందరికీ వద్దు - ఆ వొక్క జాబుకు జవాబు బాబుతో ఎలాగైనా రాయించుకోవాలి' అని నిర్ణయించుకుంది.

సుహాసిని చెప్పిన మాటల్లోనే జవాబు రాసిచ్చాడు. కళ్ళతో చూడలేకున్నా మనసులోని భావాలు ఎంత అందంగా వెల్లడించిందో! అనుకున్నాడు దినకర్. 'చక్కలంక మురళి' నుండి లెటర్సు రెగ్యులర్‌గా వస్తున్నాయి. దినకర్‌తో జవాబులు రాయించి తీసుకెళుతోంది సుహాసిని. ఉత్తరాల ద్వారానే మురళి - సుహాసిని మధ్య క్రమేపీ పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని జాబులు చదవడం- రాయడం ద్వారా తన కళ్ళముందు జరుగుతున్న సినిమా చూస్తున్నట్లు ఒక ప్రేక్షకుడిలా గమనిస్తున్న దినకర్‌కు ప్రేమకథా చిత్రాన్ని చూసి ఆనందించినట్లుంది.

తండ్రి మరణానంతరం అందిన డబ్బు, స్వంత ఇల్లు, పై పోర్షను మీద అందే అద్దెలతో తల్లికి తనకు హాయిగా గడిచిపోతుందని - తన పాటల ద్వారా అందే డబ్బు అదనంగా సేవింగ్సని తెలియజేసింది సుహాసిని. టూర్ల మీద అతను తిరిగే వూర్లు, చూసే స్థలాలు - ఎక్కడున్నా మదిలో తొలగని సుహాసిని జ్ఞాపకాల గూర్చి మురళి వ్రాస్తున్నాడు. ఆ ప్రదేశాలన్ని అతని ఉత్తరాల ద్వారా తను చూసి ఆనందిస్తున్నట్లు వ్రాయించుకుంది సుహాసిని. రాను రాను సిటీ కొచ్చి కలవాలనే తన ఉబలాటాన్ని ఎక్కువగా వెల్లడిస్తున్నాడు - మురళి. ఇంతవరకు ఆమె అంధత్వాన్ని గూర్చి రాయలేదు. ఆలస్యం చేయకుండా ఆ విషయం తెలియపరచడం మంచిదనిపిస్తోంది - దినకర్‌కు. అయితే అలా రాయాలని సుహాసినికెలా సూచించడమా! అన్న మీమాంసలో పడ్డాడు. చివరకు ఒకరోజు ఉత్తరం రాయమని వచ్చిన సుహాసినితో ఆమాట చెప్పి చూశాడు.

"ఆ విషయం అతనికి తెలిసే ఉంటుంది కదా!" అంది సుహాసిని.

"ఏమో తెలిసే ఉంటుందని నమ్మకంగా ఎలా చెప్పగలం! నీ ముఖం చూసి తెలుసుకోవడం వీలు కాదు. చెప్పేవరకు తెలియదు".

"అయితే ఈ రోజే రాయి బాబూ"! అంది సుహాసిని.

"మురళీ! గుడ్డిదాన్ని అయిన నాకు - నీ కళ్లతో ఈ లోకాన్ని జీవితాంతం చూడాలని నా ఆశ", అని రాశాడు ఉత్తరంలో - దినకర్.

అదే చివరి ఉత్తరం అయింది. ఆ తర్వాత మురళి నుండి లెటర్సు అందలేదు సుహాసినికి. దిగులుతో బయటకే రావడం మానేసింది. రేడియో, టివి కార్యక్రమాలకు వెళ్ళడం లేదు. ఆ అమాయకురాలి పరిస్థితి చూసిన దినకర్ - ఆమెకు చెప్పకనే మొదటే వుత్తరంలో ఆ మాటలు రాసిఉంటే పరిస్థితి ఇంత దాకా వచ్చేది కాదు కదా! అని బాధపడ్డాడు.

ఆ రాత్రి తన ఆడియో కేసెట్లో తనకిష్టమయిన ముఖేష్ - ఓల్డు సాంగ్స్ వింటున్నాడు - దినకర్.

" ...కే మర్కెభీ కిసీకి యాదోంమే జియేంగే హమ్
కిసీకి ఆంసువోఁ ముస్కురాయేంగూ
కిసీక దర్ద్ ముసకే తో లేవురా
జీనీ ఇసీక నామ్ హై ..."

"అనాడి" లో పాట వినిపిస్తోంది.

"వీలయినంత వరకు ఇతర్ల బాధను పంచుకొని మరణించాక కూడ ఇతర్ల జ్ఞాపకాల్లో జీవించేలా - ఇతర్ల కన్నీటిలోని నవ్వు ముఖం కనిపించేలా - ఆనందం పంచడమే ఇతర్ల జీవితం.

ఆనాటి పాటల్లో ఎంత మధుమైన సాహిత్యమో!

సుహాసినికి తన కళ్ళతో లోకాన్ని, జీవితాన్ని చూపించాలన్న తన నిర్ణయాన్ని - దినకర్ - తన తల్లి దండ్రులకు తెలియజేశాడు. మొదట వాళ్ళు బాధపడినా - తమ కళ్లముందు పుట్టి పెరిగిన ఆ యువకుడి ఆదర్శానికి తలవంచకుండా వుండలేకపోయారు చివరకు.

అయిదేళ్ళ తర్వాత ఆ రోజు తనను ఆఫీసులో కలిసిన చక్కలంక మురళి విషయం - అతడి సమస్యలు తన శ్రీమతి - సుహాసినికి చెప్పాలా! వద్దా! అనుకున్నాడు దినకర్.

ఆమె పక్కన చేరి ముద్దులతో ముంచెత్తి అందమైన ఆమె పొందులో మురిసి, మురిపించి, పరవశించి - ఇద్దరి శరీరాలు ఒకటే అన్నంత దగ్గరగా సుహాసినితో ఉన్న దినకర్ చివరకు - మురళి విషయం ఆమెకు చెప్పనవసరం లేదనే నిర్ణయించాడు.

●